క్లుప్తంగా

ఆకట్టుకున్న వీధి నాటకం



వాలి, సుగ్రీవుడి యుద్ధం వీధి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కళాకారులు వాలి సుగ్రీవుని యుద్ధం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో వాలిగా కోనిబోని రాజు, సుగ్రీవునిగా ఇసరపు రాజు, ఆంజనేయుడిగా గొనగాని శ్రీను, రాముడిగా గొనగాని సత్తిబాబు, లక్ష్మణుడిగా గొనగాని నానాజీ, చిన్న ఆంజనేయుడిగా అమరపల్లి బాలు, తారగా బుద్దాల ముసిలి నటించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్–డ్రేసింగ్ చేశారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు అమరేశ్వర ఘనపాఠి, అర్చకులు కోట వంశీ, యడవిల్లి ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

గ్రామాల్లో అన్నదానం



లింగంపర్తిలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: దేవీ నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని శుక్రవారం పలు గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. లింగంపర్తిలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నదానం చేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు అడపా పార్థసారథి, యార్లగడ్డ రాజాచౌదరి, అలమండ చలమయ్య, చిక్కాల లక్ష్మణరావు తదితరులు ఉన్నారు. ఏలేశ్వరం ఆర్టీసీ డిపో సమీపంలోని అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

కిర్లంపూడి మండలంలో...

కిర్లంపూడి: జగపతినగరంలోని అభయ దుర్గమ్మ, కిర్లంపూడి శివారు వేంచేసిన వనదుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఒమ్మంగి - శరభవరం రోడ్డుకు మోక్షం



ఒమ్మంగి-శరభవరం రహదారి నిర్మాణ పనులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి – శరభవరం రోడ్డుకు మోక్షం కలిగింది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాగా ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చొరవతో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఒమ్మంగి రాజ్ చెరువు నుంచి శరభవరం సమీపంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వరకూ రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి.

ఉపాధికి ఊతం

- ఫిష్ ఆంధ్ర యూనిట్ల ఏర్పాటుతో యువతకు ఉపాధి
- నాణ్యమైన చేపల ఉత్పత్తులే లక్ష్యం
- రాయితీలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే 14 షాపుల ఏర్పాటు



పెరుమాళ్లపురం పంచాయతీ ఆవులమంద ఫిష్ ఆంధ్ర యూనిట్‌లో చేపల అమ్మకాలు

తొండంగి: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద, మధ్యతరగతి వర్గాల యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వారిని వ్యాపారపరంగా ప్రోత్సాహించడంతో పాటు నాణ్యమైన చేపల ఉత్పత్తులే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర స్కీమ్‌ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంది. మత్స్యశాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మత్స్య ఉత్పత్తులను పెంపొందించి హబ్ అండ్ స్పోక్ మోడల్ ద్వారా డొమెస్టిక్ ఫిష్ మార్కెట్లను ఏర్పాటు చేస్తుంది. నిరుద్యోగ సమస్యను తగ్గించి యువతకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర స్కీమ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న కలుషిత మాంసాహార ఉత్పత్తులను తగ్గించి ఎన్నో పోషక విలువలు కలిగిన చేపల ఉత్పత్తులను తక్కువ ధరకు ప్రజలకు అందించనున్నారు.

ఫిష్ ఆంధ్ర యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు

ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. మత్స్యశాఖ ద్వారా యూనిట్ల ఏర్పాటుకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ ఆర్థిక సాయం అందిస్తోంది. ఆసక్తి కలిగిన యువత నిర్ణయించుకున్న యూనిట్ విలువలో 10 శాతం పెట్టుబడి పెడితే ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీ ద్వారా రుణాన్ని ఇప్పిస్తుంది. యూనిట్ విలువను బట్టి ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీ, బీసీ, జనరల్ వర్గాల వారికి 40 శాతం రాయితీ కల్పిస్తోంది.

14 యూనిట్ల ఏర్పాటు

తుని మత్స్యశాఖ పరిధిలో ఇప్పటికే తొండంగి మండలంలోని 10 యూనిట్లు, శంఖవరం మండలంలోని 3, తునిలో 1 ఫిష్ ఆంధ్ర యూనిట్లను ఏర్పాటు చేసినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. యువతకు ఈ వ్యాపారం చేయాలన్న ఆసక్తి ఉంటే గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజల నుంచి ఆదరణ బాగుంది



నేను ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరుమాళ్లపురం పంచాయతీ ఆవులమంద గ్రామంలో ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను ఏర్పాటు చేశాను. తక్కువ ధరకే చేపల ఉత్పత్తులను విక్రయిస్తున్నాను. ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. ఈ వ్యాపారంతో ఆర్థిక ఇబ్బందులు తీరడంతో పాటు ఉపాధి లభించింది. అంతే కాకుండా మరో ఇద్దరికి ఉపాధి కల్పించగలుగుతున్నాను.

– గంగిరి వెంకటేశులు, కొత్తపెరుమాళ్లపురం, తొండంగి మండలం

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నాణ్యమైన చేపల ఉత్పత్తులే లక్ష్యంగా ప్రభుత్వం ఫిష్‌ఆంధ్ర యూనిట్లను మంజూరు చేస్తోంది. ఇప్పటికే 14 యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా ఒక్కో షాపులో ముగ్గురి నుంచి నలుగురికి ఉపాధి లభిస్తోంది. ఆసక్తి కలిగిన యువత గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్లను సంప్రదిస్తే రాయితీపై యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, తుని

ఆరోగ్యానికి మేలు



సీ ఫుడ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చేపలు, రొయ్యలు, ఇతర సీ ఫుడ్స్‌లో కాల్షియం, విటమిన్లు వంటి ఎన్నో పోషక విలువలు ఉంటాయి. ఆహారంలో వీటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. మాంసాహారులు చేపలను ఆహారంగా తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

– పి.రవికుమార్, వైద్యాధికారి, ఏవీ నగరం పీహెచ్‌సీ

నేడు, రేపు ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డీడీఓ కేఎన్‌వీ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం మండలాలతో పాటు ఏలేశ్వరం నగర పంచాయతీలోని 227 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రసాదరావు సూచించారు.

25 పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాల పరీక్షలు



ప్రత్తిపాడు హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు: మండలంలోని 25 పాఠశాలల్లో శుక్రవారం కనీస అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసే పరీక్షలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని 3వ, 6వ, 9వ తరగతుల విద్యార్థులకు పరీక్షలు రాశారు. పలు పాఠశాలల్లో జరుగుతున్న ఈ పరీక్షలను మండల విద్యాశాఖాధికారి వి. రాజబాబు తనిఖీ చేశారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక లింగంపర్తి రోడ్డులోని ఎన్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీలకు ఎమ్మెల్యే పర్వత దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టడం ద్వారా జరిగే మేలును ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, మున్సిపల్ చైర్ పర్సన్ అలమండ సత్యవతి, వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు అడపా పార్థసారథి, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, నీరుకొండ సత్యనారాయణ, పసల నాగేశ్వరరావు, చిక్కాల లక్ష్మణరావు, సాదే లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రాకూరుపాలెంలో అగ్నిప్రమాదం



బాధితులకు నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: గంగంపాలెం పంచాయతీ పరిధిలోని రాకూరుపాలెంలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన వేలంపర్తి చిన్నయ్యదొర ఇంటి నుంచి అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న వారు వెంటనే బయటకు వచ్చి స్థానికుల సహాయంతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు పూర్తిగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిపోయింది. బీరువాలో ఉంచిన రూ.లక్ష నగదు సైతం అగ్నికి ఆహుతైనట్టు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొడ్డి నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ శుక్రవారం బాధితులను పరామర్శించి నగదు, బియ్యం, ఇతర నిత్యావసరాలను పంపిణీ చేశారు. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత జ్యోతుల రామస్వామి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించి రూ.5 వేలు, 50 కేజీల బియ్యం, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్, బాడితబోయిన చిన్న, నందూరి బుజ్జి, తాటికొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష



ఒమ్మంగిలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్షగా నిలుస్తోందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, పార్టీ యూత్ లీడర్ రామిశెట్టి బులిరామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ఆర్.పవన్‌కుమార్, వై.గీతా సుధ, జీవీ కిరణ్, రాజిక్, సీహెచ్ సౌజన్య తదితరులు గ్రామంలోని 410 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు మందుల కిట్లు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను స్థానిక నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, పినిశెట్టి ప్రకాష్, మామిడి నరసింహమూర్తి పాల్గొన్నారు.

వైద్యం కోసమే చంద్రబాబుకు బెయిల్



అరుగుల మోషే

కోటనందూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో నిందితుడిగా ఉన్న చంద్రబాబుకు కేవలం వైద్యం చేసుకునేందుకే హైకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిందని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు, మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అరుగుల మోషే అన్నారు. కోటనందూరులో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైద్య చికిత్స కోసం చంద్రబాబు బయటకు వస్తే ఆయనకు భారతరత్న అవార్డు వచ్చినట్లు టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా సంబరాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు ఫైబర్ నెట్, మద్యం, ఇసుక కుంభకోణాల్లో నిందితుడిగా ఉన్న చంద్రబాబు తిరిగి జైలుకు వెళ్లక తప్పదన్నారు. టీడీపీ, చంద్రబాబు రోజురోజుకూ ప్రజాధరణ కోల్పోతున్నారన్నారు. తెలంగాణలో టీడీపీ అధ్యక్షుడితో పాటు అనేక మంది నాయకులు పార్టీకి రాజీనామా చేశారన్నారు. ఇదే దుస్థితి ఆంధ్రాలో కూడా వస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులతో వాసవీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

తుని: కంటి సంరక్షణకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి సూచించారు. స్థానిక సీతారాంపురం చెక్కా శ్రీరామ్మూర్తి ఉన్నత పాఠశాలలో శుక్రవారం వాసవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. 6 నుంచి 10 వరకూ చదువుతున్న 480 మందికి డాక్టర్లు కంటి పరీక్షలు చేశారు. ఇందులో 85 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని శోభారాణి సూచించారు. పుష్ప కంటి ఆసుపత్రి వైద్యుడు పి.కుమార్ కంటి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అవోగా అధ్యక్షుడు కడిమిశెట్టి సూర్యప్రకాష్, కౌన్సిలర్ సుభద్రాదేవి, పాఠశాల హెచ్‌ఎం శర్మ, కుసుమంచి సత్యనారాయణ, దాసరి నూకయ్యశెట్టి, పోలిశెట్టి వాసు, ప్రసాద్, వీరభద్రరావు, వెంకట సుబ్బారావు, వెంకటరమణ, కామరాజు పాల్గొన్నారు.

కాలువలో వాహనాల శుభ్రతపై ఆందోళన



ఏలేరు కాలువలో లారీని శుభ్రం చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: పట్టణంలోని ఏలేరు ప్రధాన కాలువలో వాహనాలను శుభ్రం చేయడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బ్రాహ్మణరేవు నుంచి వాహనాలు కాలువలోని వస్తున్నాయి. వీటిని కాలువ నీటితో శుభ్రం చేయడంతో మురుగు నీరు దిగువ ప్రాంతాలకు వెళుతోంది. వాహనాల ఆయిల్ పడి నీరు కలుషితమవుతోంది. మురుగు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లడంతో రైతులు, రజకులు ఇబ్బందులు పడుతున్నారు. దిగువ ప్రాంతంలోని రేవుల్లో రజకులు దుస్తులు ఉతుకుతుంటారు. రైతులు ఈ నీటికి మూగ జీవాలకు తాగునీరుగా ఉపయోగిస్తారు. నీరు కలుషితం కావడంతో పశువులు తాగడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తుని: స్థానిక పాయకరావుపేట– గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని 70 ఏళ్ల వృద్ధుడు మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైలు ఢీకొనడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోటరీ రంగం ఉత్సవాలు ప్రారంభం



తుని రోటరీక్లబ్ వ్యవస్థాపకుడు చల్లా సుబ్బారాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రోటరీ రంగం ఉత్సవాలను ఆ క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ లక్కరాజు సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. తొలి రోజు విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. తుని పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వచ్చే నెల 8వ తేదీ వరకూ విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, భగవద్గీత శ్లోకాలు, చిత్రలేఖనం, సైన్స్ ఫెయిర్, క్విజ్, ఖోఖో, చదరంగం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తామని క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కేఎల్‌ఎన్‌ఎస్ వర్మ తెలిపారు. తుని రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను రోటరీ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ సత్యనారాయణ కొనియాడారు. రోటరీక్లబ్ కార్యదర్శి కె.కిశోర్‌రెడ్డి, కోశాధికారి కె.గణేష్, అసిస్టెంట్ గవర్నర్ గొల్లపూడి బుచ్చిరాజు, పోటీల కన్వీనర్ పి.ప్రసాద్, మంగరాజు, కుసుమంచి సుబ్బరాయుడు, పి.కామరాజు, డీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ప్రత్తిపాడు: గ్రామ స్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి జిల్లా స్థాయిలో కమిటీలను పునర్ వ్యవస్థీకరిస్తున్నట్టు చెప్పారు. మండలంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం పార్టీ మండలాధ్యక్షుడిగా కందా వీరాస్వామిని నియమించారు. సమావేశంలో బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, కర్రి ధర్మరాజు, చింతాకుల రామకృష్ణ, పెట్ల కొండబాబు, గున్నాబత్తుల రాజబాబు, మదినే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ పేషెంట్‌కు పింఛను అందజేత



డి.పోలవరంలో తాతారావుకు రూ.10 వేలు పింఛన్ అందిస్తున్న నాయకులు

తుని రూరల్: మండలంలోని డి.పోలవరం గ్రామానికి చెందిన గంగవరపు తాతారావు కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అతనికి వైద్యులు డయాలసిస్ చేస్తున్నారు. ప్రభుత్వం అతనికి కొత్తగా పింఛన్ మంజూరు చేసింది. అతనికి మంజూరైన పింఛన్ రూ.10 వేలను మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకుడు చిటికెల వరహాలబాబు శుక్రవారం అందజేశారు. ఇకపై అతనికి ప్రతి నెలా రూ.10 వేల పింఛను వస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యే పర్వతకు కృతజ్ఞతలు



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వతకు కృతజ్ఞతలు తెలుపుతున్న కుల సంఘాల నేతలు

శంఖవరం: అన్నవరం గ్రామానికి చెందిన నాయీ బ్రాహ్మణ, రజక సంఘాల సభ్యులు శుక్రవారం శంఖవరంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జగనన్న చేదోడు పథకంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల వృత్తులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా ఆదుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చారని తెలిపారు.

పంటలకు రక్షిత చెరువు నీరు

జగ్గంపేట: వర్షాభావంతో ఎండిపోతున్న వరి పంటలకు మంచినీటి చెరువు నీటిని రైతులు బోర్ల ద్వారా అందిస్తున్నారు. మండలంలోని రాజపూడిలో వరి పంటను కాపాడుకొనేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సాగునీరు అందక ఎండిపోతున్న పంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచన ఊపిరి పోసింది. గ్రామంలోని నీటి వనరులు అన్నింటినీ వినియోగించుకుని పంటలు కాపాడుకోవాలని ఎమ్మెల్యే చంటిబాబు రాజపూడి సర్పంచ్ బూసాల విష్ణుకు సూచించారు. దీంతో పంచాయతీలో తీర్మానం చేసి గ్రామంలోని మంచినీటి చెరువుల్లో తాగునీటి వరిపంటకు బోర్ల ద్వారా అందించడానికి ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ విష్ణు తెలిపారు.

కోటి బిల్వార్చనకు సర్వం సిద్ధం

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు ఎదురుగా ఉన్న ఆకుల వీర్రాజు స్థలంలో శనివారం నిర్వహించే కోటి బిల్వార్చన, పడి పూజలకు సర్వం సిద్ధమైంది. తుని, పాయకరావుపేట అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కోటి బిల్వార్చన, పడిపూజ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తులు, వలంటీర్లు శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు నిర్వహించారు. 15 వేల మంది అయ్యప్ప మాలధారణ భక్తులు, మరో ఐదు వేల సాధారణ భక్తులు కోటి బిల్వార్చనలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మాలధారణ భక్తులు స్నానాలు ఆచరించేందుకు, వాహనాలు పార్కింగ్ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.